విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 18 అక్టోబరు 2024 8 పేజీలు

పేదలందరూ...

పక్కా ఇళ్లు నిర్మించుకోవాలి

- ఏర్పేడు మండలంలో పర్యటించిన కలెక్టర్

విశాలాంధ్ర -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని చెన్నప్ప గుంట ఎస్టీ కాలనీ, కందాడు గ్రామపంచాయతీలో గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పర్యటించారు. వర్షాలకు కూలిపోయిన మట్టి ఇళ్లను, పూరి గుడిసెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఎన్ని రోజులుగా పూరి గుడిసెలో ఉన్నారని తెలుసుకున్నారు. పేదలందరూ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.

ఘనంగా...

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

- వార్త 8వ పేజీలో

రైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు

: ఎంఎల్సీ

- వార్త 8వ పేజీలో

సిపిఐ నేత రమణయ్య సతీమణి అన్నపూర్ణమ్మకు నివాళులు అర్పించిన పార్టీ నేతలు

విశాలాంధ్ర -సూళ్లూరుపేట : సిపిఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల రమణయ్య సతీమణి మోదుగుల అన్నపూర్ణమ్మ బుధవారం సాయంత్రం మృతి చెందారు. వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తుది శ్వాస విడిచారు. స్వగ్రామం సూళ్లూరుపేటలో గురువారం దహన క్రియలకు విచ్చేసిన నాయకులుసిపిఐ జెండాను మృతురాలు పై ఉంచి కుటుంబ సభ్యులకు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ .రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి. మురళి, కె. రాధాకృష్ణ జిల్లా ఏఐటియుసి కార్యదర్శి, సిపిఐ సీనియర్ నాయకులు మోదుగుల పార్థసారథి, సుధాకర్ రెడ్డి, ఈలప నాగేంద్ర, ఆనంద్ బాబు, తడ సిపిఐ నాయకులు శ్రీనివాసులు, లోక్కు రమణయ్య తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రూ. 5.3 కోట్లతో 14 చెరువుల అభివృద్ధి

- జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలో 5.3 కోట్లతో 14 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆయన గురువారం రొంపిచెర్ల తహసిల్దార్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులలో పూడిక తీత పనులను చేపడతామన్నారు. అలాగే గ్రామ సచివాలయ సిబ్బంది పనివేళలలు పాటిం చాలన్నారు. విధులు సక్రమంగా హాజరు కాకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ఎంపీడీవో సచివాలయలను వారంలో మొదట రెండు రోజులు సచివాలయాలను తనిఖీ చేయాల న్నారు. గ్రామా లలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు .ప్రజల దగ్గర ఇంటి , తాగునీటి పనులు కూడా సకాలంలో వసూలు చేయాలన్నారు. పనులతోనే గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచిం చారు. మండలంలో 37 అంగన్వాడి కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేస్తారని చేస్తామని తెలిపారు. రొంపిచర్ల క్రాస్ రోడ్ లోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి వాటి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. వికలాంగు లకు యుఐడి, నెంబర్లను ఇచ్చి వారికి పరికరాలను అందజేస్తామని తెలిపారు. గత మూడు సంవత్సరాల క్రితం కురిసిన వర్షాలకు బాలుర బీసీ హాస్టల్ లో ప్రహరీ గోడ కూలి పోయిందని చెప్పడంతో పరిశీలించి అప్పటికప్పుడు ఏఈ తో మాట్లాడి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు తాను విడుదల చేస్తానని తెలి పారు. జలజీవన్ మిషన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు .నిధుల సమస్యతో తాగునీటి ట్యాంకులు పనులు ఆగిపోయాయని తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారులను త్వరలోనే మరమ్మత్తులు చేస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో తహశిల్దార్ కిరణ్ కుమార్ ,ఎంపీడీవో మధు సూదన్ రెడ్డి, డిటి లోకేష్, ఇరిగేషన్ ఏఈ మునిరాజా, ఎంఈఓలు ఇందిరా, శ్రీనివాసులు ఏపీవో, బాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష కార్యదర్శులు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

గరుడ వాహనం సర్వపాప ప్రాయశ్చిత్తం: పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ సీవీఎ స్వో శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, డిప్యూటీ ఈఓ భాస్కర్, పేష్కార్ శ్రీ రామ కృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జేబీ రమణకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : టీడీపీ నేత జేబీ రమణ తండ్రి మన్నెం కోటేశ్వరరావు బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం రాత్రి శ్రీనివాసపురం పంచాయతీ పరిధిలోని జేబీ రమణ, జేబీ శ్రీనివాస్ ల ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలు అడగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మోహిత్ రెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు కూడా వున్నారు.

శ్రీ కోదండరామాలయంలో
ఘనంగా అష్టోత్తర శతకలశాభిషేకం

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం అష్టోత్తర శతకలశాభిషేకం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలోని కల్యాణమండపంలో ఉదయం 9 నుండి 10.30 గంటలకు అమ్మవారు, స్వామివార్ల ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయంలో ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు హ్యుందాయ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: హ్యుందాయ్ మోటర్ ఇండియా (కంపెనీ) తమ షేర్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌ను 2024 అక్టోబర్ 15, మంగళవారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ పిఆర్ ఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ అక్టోబర్ 14 సోమవారం ఉంటుంది. బిడ్/ఆఫర్ ముగింపు తేదీ 2024 అక్టోబర్ 17 తేదీ. క్రిసిల్ నివేదిక ప్రకారం సీవై 2023లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలపరంగా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఓఈఎంగా ఉన్న హ్యుందాయ్ మోటర్ గ్రూప్‌లో హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ భాగంగా ఉందన్నారు. దీనికి కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, జేపీ మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఈ ఆఫర్‌కు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి అని తెలిపారు. మరింత సమాచారం కోసం హ్యుందాయ్ .కో .ఇన్ లో లాగిన్ అవ్వాలని కోరారు.

తిరుపతి నుంచి కాట్పాడికి రైల్వే డబుల్‌లైన్‌కు గ్రీన్ సిగ్నల్

- మంజూరు చేసిన అధికారులకు కృతజ్ఞతలు
- రాష్ట్ర నారా యువశక్తి అధ్యక్షుడు మచ్చా దొరస్వామి నాయుడు

విశాలాంధ్ర - పాకాల: పాకాల మండల పరిధిలో తిరుపతి నుంచి పాకాల జంక్షన్ మీదుగా కాట్పాడికి రైల్వే డబుల్ లైన్ మంజూరు చేసిన అధికారులకు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు రాష్ట్ర నారా యువశక్తి అధ్యక్షుడు మచ్చా దొరస్వామి నాయుడు తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో రాష్ట్ర నారా యువశక్తి అధ్యక్షుడు మచ్చా దొరస్వామి నాయుడు మాట్లాడుతూ గత మాసంలో చిత్తూరు - పాకాల - తిరుపతి ప్రయాణికుల సమస్యలపై గుంతకల్ డివిజన్ రైల్వే డిఆర్‌ఎం ఎం.విజయ్ కుమార్ కు నారా యువశక్తి అధ్యక్షుడు మచ్చా దొరస్వామి నాయుడు, నారా సుబ్రహ్మణ్యం నాయుడులు ప్రతిపాదనలు తెలియజేశారు. పాకాల రైల్వేస్టేషన్ ను గుంతకల్ డివిజన్ రైల్వే డిఆర్‌ఎం విజయ్ కుమార్ స్పందించి త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. పాకాల రైల్వేస్టేషన్ ను మోడ్రన్ రైల్వే స్టేషన్ గా తీర్చిదిద్దామని అన్నారు. ఉద్యోగస్తులు, ప్రజల సౌకర్యార్థంగా పాకాల మీదుగా ప్రత్యేక రైళ్లు వెళ్లేటట్టు ఏర్పాటు చేస్తామని అన్నారు. పాకాల ఇన్ఫాంట్ జీసస్ స్కూల్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలని కోరగా, డి.ఆర్.ఎం పరిశీలిస్తామని అన్నారు. ప్రస్తుతం తిరుపతి - పాకాల, కాట్పాడి రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కోసం 45 కి.మీ. చేపట్టడానికి పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్ పరిధిలో సుమారు 37ఎకరాలు భూ సేకరణ చేపట్టడానికి సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ వారు వర్చువల్ విధానంలో పాల్గొని సూచించారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. పాకాల రైల్వే కోచ్ డిపో కు,రైల్వే డబుల్ లైన్ మంజూరుకు కృషి చేసిన రైల్వే గుంతకల్ డివిజన్ డిఆర్‌ఎం కు, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళికి కృతజ్ఞతలు ఆయన తెలియజేశారు.

తిరుమలలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

- టీటీడీ అడిషనల్ ఈఓ సి. హెచ్.వెంకయ్య చౌదరి

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమలలో పెరిగిపోతున్న వాహనాల రద్దీని నియంత్రించేందుకు అత్యవసరంగా ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ అడిషనల్ ఈఓ సి. హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం సాయంత్రం టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడులతో కలిసి టీటీడీ, విజిలెన్స్, పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన తిరుమల ట్రాఫిక్ మేనేజ్మెంట్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుమల ట్రాఫిక్ మేనేజ్మెంట్ పై స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఈఓ మాట్లాడుతూ తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ, విజిలెన్స్, పోలీసులు, ఆర్టీఏ, టౌన్ ప్లానింగ్, ఏపీఎస్ ఆర్టీసీ, టీటీడీ ఇంజినీరింగ్, రెవెన్యూ, ట్రాన్స్ పోర్ట్ జీఎంలు కమిటీ గా ఏర్పడి వారం రోజుల లోపు సమస్యలను గుర్తించి పరిష్కారానికి సలహాలు, సూచనలు అందివ్వాల న్నారు. సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలు తిరుమలలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే గోకులం, ఏటీసీ, రామ్ భగీచా వంటి ప్రాంతాలను గుర్తించాలి. వివిధ వర్గాల భక్తులు, ప్రైవేట్ వాహనాలు, ట్యాక్సీలకు సూచిక బోర్డులను, నిర్దిష్టమైన పార్కింగ్ ను ఏర్పాటు చేయాలి. తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులకు టీటీడీ నుండి అదనపు సిబ్బందిని కేటాయించాలి. తిరుమలలో భవిష్యత్తులో చేపట్టే నిర్మాణాల్లో పార్కింగ్ సౌకర్యం తప్పనిసరి చేయడం, మల్టీ లెవెల్ పార్కింగ్ లను నిర్మించాలి. నిబంధనలను అతిక్రమించే ట్యాక్సీ డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుని, అందరూ విధిగా నిబంధనలు పాటించేలా విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు ట్రాఫిక్, పార్కింగ్ అప్డేట్స్ వచ్చేలా మొబైల్ యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, అడిషనల్ ఎస్పీ ఐ.రామకృష్ణ, వీజీఓలు రామ్ కుమార్, సురేంద్ర, టీటీడీ, విజిలెన్స్, పోలీస్, ఆర్టీఏ, ఏపీఎస్ ఆర్టీసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.రు. పరామర్శించిన వారిలో మోహిత్ రెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులు కూడా వున్నారు.

నగరపాలక సంస్థలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మహర్షి శ్రీ వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ హిందువుల గొప్ప ఇతిహాసమైన రామాయణాన్ని రచించిన గొప్ప మహనీయుడు వాల్మీకి అన్నారు. ఆయన రచించిన రామాయణం మన జీవిత అభ్యున్నతికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆయన అడుగుజాడల్లో మనందరం నడవాలని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఈ జయంతిని నిర్వహించకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, మేనేజర్ హసీమ్, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా వాల్మీకి జయంతి



విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :ఆదికవి బ్రహ్మ ఋషి రామాయణ మహాకావ్యం సృష్టికర్త మహర్షి వాల్మీకి జయంతిని గురువారం తిరుపతిలోని స్విమ్స్ ఎదురుగా కల వాల్మీకి సర్కిల్ వద్ద గల మహర్షి వాల్మీకి విగ్రహానికి తిరుపతిలోని హిందూ సంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పమాల అలంకృతను చేసి ఘనంగా పూజలు చేసి మహర్షి వాల్మీకిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు టి.గోపాల్ మాట్లాడుతూ బ్రహ్మర్షి వాల్మీకి మహర్షి యొక్క ప్రాధాన్యతని గుర్తించి రాష్ట్ర ప్రభు త్వం వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగ ప్రకటించడం సంతోషకరమని, అలాగే పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో మహర్షి వాల్మీకి విగ్రహం వాల్మీకి రామాలయం కలిగి ఉండడం యావత్ హైందవ భాషకులకు ఎంతో మంచిదని అన్నారు. మహర్షి వాల్మీకి పురుషోత్తముడైన శ్రీ రాముని యొక్క జీవిత చరిత్ర రామాయణ రూపంలో రచించి మానవాళికి జీవన విధానాన్ని తెలియజేసి వాల్మీకి మహర్షి మహోన్నత బ్రహ్మ ఋషి గా నిలిచిపోయినాదని కొనియాడారు. మహర్షి వాల్మీకి జయంతిని తిరుపతిలో వివిధ హిందూ సంఘాలు, సాంస్కృతి సంఘాలు, వాల్మీకి సంఘాలు, బీసీ సంఘాలు, మేధావులు పెద్దలందరి పెద్ద సంఖ్యలో తిరుపతిలోని స్విమ్స్ సర్కిల్ వద్ద గల వాల్మీకి విగ్రహం వద్దకు చేరి వాల్మీకి మహర్షికి పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ నాయకులు జల్లి మధుసూదన్, విశ్రాంత డైట్ ప్రిన్సిపల్, బీజేపీ నాయకులు కె చిట్టిబాబు, తిరుపతి సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, విశ్రాంతపురం కీర్తి వెంకయ్య, వాల్మీకి సంఘం అధ్యక్షులు నాగరాజు, బాలయ్య, ప్రముఖ బీసీ నాయకులు లక్ష్మీ వెంకటేశ్వర్లు, విశ్రాంతి బ్యాంక్ ఆఫీసర్ రాధా కృష్ణ, బీసీ సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, హిందూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేగల మహేష్ కుమార్, తిరుపతి వాల్మీకి సంఘం వ్యవస్థాపకుడు గుజ్జల ధర్మయ్య, తిరుమలరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృత దేహం లభ్యం

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు - కొండ గుంట రైల్వే ఎగువ మార్గంలోని రైలు పట్టాలు పై గుర్తు తెలియని యువకుడు మృత దేహం లభ్యమైంది. గూడూరు రైల్వే పోలీస్‌ల కథనం మేరకు యువకుడు వయస్సు 25 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మన్నారు.

గ్రామాల అభివృద్ధికి 'పల్లె పండుగ'

- పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు

విశాలాంధ్ర - బుచ్చినాయుడుకండ్రిగ : పల్లె పండుగ కార్యక్రమం గ్రామాల అభి, వృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, గ్రామ ప్రజల మధ్య పరస్పర సంబం ధాలను పెంపొందిం చడానికి, దోహదపడుతుందని సత్యవేడు నియోజక వర్గ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలో గురువారం తలారివెట్టు, కల్లివెట్టు, నెలవాయి గ్రామాలలో పల్లె పండుగ కార్యక్ర మం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నియోజకవర్గకు కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తెలియజేసిన పార్టీ పెద్దపేట వేస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధికి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడానికి మెరుగుపరిచేందుకు పెద్ద పునాది వేస్తుందన్నారు. దీనివల్ల గ్రామాల్లో నీటి, రవాణా, వ్యవసాయ వంటి రంగాలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుం టుందన్నారు . అంతేకాకుండా, ఈ పల్లె పండుగ కార్యక్రమం ప్రజలలో భాగస్వా మ్యాన్ని పెంచి, గ్రామాల్లో ఆర్థిక వనరుల సృష్టించడంలో కూడా దోహదపడుతుంద న్నారు. ప్రభు త్వ ఉద్దేశాలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని సన్నాహాలు చేస్తున్నా మని తెలిపారు. పల్లె పండుగ కార్యక్ర మం ద్వారా సిమెంట్ రోడ్డుకు సుమారు 8 లక్షల రూపా యలు, గోకులం షెడ్ సుమారు 2, 60 లక్షల రూపాయలు, వ్యయం తో భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఎంపీ డీవో త్రివిక్రమ్ రావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో తుమ్మల కన్న య్య నాయుడు, మధు నాయుడు, భాస్కర్ యాదవ్, సత్యవేడు నియోజక వర్గం నాయి బ్రాహ్మ ణ అధ్యక్షుడు ఎడాం వెంకటాచలం, రవి నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, పూల తోటల్లో సస్యరక్షణ చేపట్టండి

- రైతులకు ఉద్యాన శాఖ సూచనలు

విశాలాంధ్ర - వి. కోట : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉద్యాన పంటలో తెగుళ్లు ఎక్కువయ్యే అవకాశం ఉందని పేర్కొన్న ఉద్యాన శాఖాధికారి లక్ష్మి ప్రసూన వర్షాలు తగ్గిన తర్వాత కురగాయలు, పూల తోటలలో సస్య రక్షణా చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. కూరగాయ పంటలు పండించే రైతులు తోటలలో అత్యధిక తేమ ఉండడం వల్ల టొమాటో వంటి పంటలలో కాయలు పగిలిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో పంటపై బోరాన్ 1గ్రా./లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.వాతావరణంలో అధిక తేమ వల్ల పంటను ఆశించే ఆకుమచ్చ (ఎర్లీ బ్లైట్, లేట్ బ్లైట్) తెగుళ్ల నివారణకు ముందస్తు చర్యగా పంటకు లీటరు నీటికి3గ్రా. మ్యాంకోజెబ్ లేదా 2గ్రా. క్లోరోథలోనిన్ లేదా 1గ్రా. డైమిథోమార్ఫ్ మందులను పిచికారి చేయాలన్నారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించ కుండా ముందు జాగ్రత్తగా మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 2.5గ్రా. కాపర్ హైడ్రాక్సైడ్ ప్లస్ 0.2 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పూల తోటలలోగాలిలో తేమ అధికంగా ఉండడం వల్ల బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని నివారణకు మైక్లోబ్యూటానిల్ 1గ్రా.లేదా మిథైల్ 1గ్రా.ను లీటరు నీటికి కలిపి వారంలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. నేలలో తేమ అధికంగా ఉండటం వల్ల వేరుకు ళ్ళ తెగులు ఆశించే అవకాశం ఉంటుందని కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రా.లేదా మెటలాక్సిల్ 3గ్రా. లేదా ట్రైకోడెర్మా పొడిని5-10 గ్రా.లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గరగా పోయాలన్నారు. మొక్కలపై 13:0:45 (పొటాషియం నైట్రేట్) లేదా 19:19:19 లను లీటర్ నీటికి ఐదు గ్రామాలు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకు మచ్చ అలాగే ఆకుమాడు తెగుళ్ల నివారణకు క్లోరోథాలోనిన్ 2 గ్రా.లేదాథయో పినేట్ మిథైల్ 1గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మునిగిన పంటలను వ్యవసా యశాఖ అధికారి భారతి తన బృందంతో గురు వారం పరిశీ లించారు. మండలంలోని కనమనంబేడు,కుక్కంబాకం, నేరిణికండ్రిగ, తలారివెట్టు గ్రామాలలో నీట మునిగిన 'చల్లకం' వరిపంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, రైతులతో వారిని కష్టాలను అడిగి తెలుసుకున్నారు, వారితో మాట్లాడుతూ కురిసిన వర్షానికి జరిగిన నష్టాన్ని జిల్లా అధికారులకు నివేదికలు తయారుచేసి సమాచారం అందిస్తామన్నారు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తే రైతులు స్వీకరించవచ్చు అన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - చౌడేపల్లి : ఆదికవి రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక మండల పరిపాలన భవనం వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఉంచి పూలమాలవేసి నివాళులర్పించారు అన్నదమ్ముల అనుబంధం తల్లిదండ్రుల బాధ్యతలు రాజ్యపాలన వంటి విషయాలను అందించిన మహాకవి వాల్మీకి మహర్షి అని తెలుగుదేశం పార్టీ సీనియర్ బిసి నాయకుడు ఆవుల రామచంద్రయ్య అన్నారు వాల్మీకి మహర్షి చరిత్రను వివరిం చారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు వాల్మీకులు వ్యక్తిగతంగా సామాజికంగా ఎదగాలంటే ఎస్టీ జాబితాలో చేర్చాలని వారు కోరారు ఈ కార్యక్ర మంలో ఆదినారాయణ గంగరాజు మునుస్వామి గురుమూర్తి నరేష్ జగదీష్ మునిరత్న శివ శంకర గంగులప్ప రెడ్డి నాగరత్నమ్మ రెడ్డమ్మ ముని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- పల్లె పండుగ వారోత్సవాల్లో టిడిపి సమన్వయకర్త డాక్టర్ శ్రీపతిబాబు

విశాలాంధ్ర -సత్యవేడు: గ్రామ సర్వతోముఖాభివృద్దె టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమనీ సత్యవేడు నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త డాక్టర్ శ్రీపతిబాబు అన్నారు.గురువారం మండల పరిధిలోని కొత్త మారికుప్పం ఎస్టీ కాలనీలో పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాలు ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజవర్గ టిడిపి పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు పరమశివం,ఎస్సై రామస్వామి, తహసిల్దారు సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి సమన్వయకర్త డాక్టర్ శ్రీపతిబాబు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో అభివృద్ధి శూన్య మన్నారు.వ్యవస్థలన్నీ నాశనం చేయడంతో పాటు కేవలం కచ్చ సాధింపు ధోరణి తోనే ఐదేళ్ల పాలన సాగింది అన్నారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఒకపక్క సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు మరోపక్క పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. టిడి పి పరిశీల కలు చంద్రశేఖర్ నాయుడు మాట్లాడు తూ ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను ప్రారంభించిం దన్నా రు.అంతకు మును పు కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీలో టిడిపి సమన్వయకర్త డాక్టర్ బాబు, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు స్థానిక టిడిపి నేతలు, అధికా రులతో కలిసి 65 మీటర్ల మేర 2 లక్షల70 వేల రూపాయల వ్య యంతో నూతన ంగా నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఇదే తరహాలో అమాసరెడ్డి కండ్రిగ వద్ద 80 మీటర్ల మేర 3 లక్షల 30 వేల రూపాయలు వ్యయ ంతో సిమెంట్ రోడ్డును నిర్మించనున్నట్టు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధన లక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ సభ్యుడు అమాసయ్య,టిడిపి నాయకులు షణ్ముగం, సురేంద్ర, శశి నాయుడు మండల ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, పంచాయతీ సెక్ర టరీలోకేష్ ,హరీష్, ఉపాధి ఏపీవో కృష్ణయ్య,తదితరులు పాల్గొన్నారు.

నేడు సఫాయి కర్మచారి ఛైర్మన్ జిల్లాకు రాక

విశాలాంధ్ర -చిత్తూరు: సఫాయి కర్మచారి ఛైర్మన్ ఎం.వెంక టేశన్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సఫాయి కర్మచారి ఛైర్మన్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మద్యాహ్నం 2.00 గం. లకు చిత్తూరు చేరుకుని, మద్యాహ్నం 3 గం. లకు జిల్లా కలెక్టర్ ఎస్పి లతో కలసి పారి శుధ్య కార్మికుల కాలనీలను పరిశీలిస్తారని తెలిపారు. అనం తరం మ.3.30 గం.లకు పారిశుధ్య కార్మికులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు పై జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్ పి, మున్సిపల్ కమిషనర్, చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి డీన్, జిల్లా కార్మిక సంక్షేమ అధికారి, ఈ ఎస్ ఐ సి, ఈ పి ఎఫ్ అధికారులు, సఫా యి కర్మచారి సంఘ నాయకులతో కలసి ఛైర్మన్ సమీక్షా సమా వేశం నిర్వహిస్తారని, కార్యక్ర మానంతరం సా.7.00 గం. లకు తిరుపతిబయలుదేరివెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఈనెల 22న ఆధార్ క్యాంపులు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పురపాలక పరిధిలో ఈనెల 22 నుండి 25వ తేది వరకు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు కొరకు ,బయో మెట్రిక్ అప్డేటెడ్, చిరునామా మార్పు కొరకు ఈనెల 22వ తేదీన ఇందిరానగర్ -3, చెన్నూరు -2 సచివాలయం, 23వ తేదీన ఇందిరా నగర్ -1, చెన్నూరు - 1 సచివాలయం, 24వ తేదీన నరసింగ రావు పేట, చెన్నూరు -3 సచివాలయం, ఈనెల 25వ తేదీన మాలవ్యనగర్-3 సచివాలయం, నెల్ల టూరు సచివాలయంలో ఆధార్ క్యాంపులు ను నిర్వహిస్తున్నామని. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పత్రిక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విజయనగర సామ్రాజ్యధీశులు శ్రీకష్ణ దేవరాయలు 496వ వర్ధంతి వేడుకలు గురువారం శ్రీకాళహ స్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాపు సం ఘం నేతలు రాజగోపురం వద్ద శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కీర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివా సులు, కాపు సంఘం నాయకులు ఉప్పు కిష్టయ్య, పూల కృష్ణమూర్తి, అంజూరు వెంకటేష్ బాబు, పూడి రవి, కంతా ఉదయ్ కుమార్, సాధన మున్నా రాయల్, గరికిపాటి చంద్ర, మొగరాల గణేష్, శ్రీవారి సురేష్, రవి, వల్లం గోపి, వేలూరు రమేష్, మైనంపాటి మస్తాన్, చింతామణి యానాది, గంగాధరం, సుబ్బరాజు, కామి వెంకటేశ్వర్లు, నరేంద్ర, మణి, చిరంజీవులు, సురేష్, పురుషోత్తం,సూరి,ధన,ప్రసాద్, ఈశ్వర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ ప్రాంగణంలోని 16కాళ్ల మండపంలో ఈ వేడుకలు జరిపారు. ఇందులో భాగంగా వాల్మీకి మహర్షి చిత్రపటం ఉంచి ప్రత్యేక పూజలుచేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్, ఏఈవో లోకేష్ రెడ్డి, ఏఈవో సతీష్ మాలిక్, సూపరింటెండెంటు, సీఎస్వో నాగభూషణం యాదవ్, సూపరింటెండెంటు శ్రీహరి, టెంపుల్ ఇన్స్పెక్టర్‌హరి యాదవ్, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

బోయకొండపై పౌర్ణమి చండీహోమం

విశాలాంధ్ర - చౌడేపల్లి : శక్తి క్షేత్రం బోయకొండపై గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హోమాన్ని నిర్వహించారు ఉదయాన్నే అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకము అలంకరణ నిర్వహించారు. మండపంలో అమ్మవారి విగ్రహం ముందు వేద పండితులు గోవర్ధన శర్మ ఆధ్వర్యంలో దంపతుల సమక్షంలో కలశ స్థాపన పూర్వక చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. చండీ హోమంతో ఆలయం దద్దరిల్లింది ఆల య ఇవో మరియు ఉప కమీషనర్ ఏకాంబరం సేవలందించారు.

ఘనంగా కలవగుంట త్రిషికరెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ విని యోగ దారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి, పల్లవి దంపతుల తనయి త్రిషికరెడ్డి మొదటి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. త్రిషికరెడ్డి జన్మ దినం పురస్కరించుకుని తొట్టంబేడు మండలం శివనాథపురం వద్ద గల అమ్మఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమం లోని వృద్ధ మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. త్రిషిక రెడ్డికి అమ్మ ఆశ్రమ నిర్వాహకుల వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. త్రిషిక రెడ్డి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఈ సంద ర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు భూదేవి ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మంలో కలవగుంట భరత్‌రెడ్డిబంధుమిత్రులు,భరత యువసేన సభ్యులు పాల్గొన్నారు.

చెంగాలమ్మను దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ పి.శ్రీసుధ దర్శించుకొన్నారు. వారిని సహాయ కమిషనరు కార్యనిర్వాహణాధికారి బి. ప్రసన్నలక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనంతరం వేద పండితులచే శ్రీ అమ్మవారికి పూజలు నిర్వహించన తదుపరి వేదపండితులచే ఆశీర్వచనము చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి. ఈ.కిరణ్మయి, సూళ్ళూరుపేట జడ్జి అనూష, సులూరుపేట తాసిల్దార్ నరసింహ రావు, మురళి క్రిష్ణ, బ్రాహ్మణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగతో గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండలంలోని పల్లెల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కయ్యూరులో 12 లక్షలు, కాలగందలో 13 లక్షలు, సిద్దాగుంటలో 4 లక్షలు చొప్పున 29 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వినీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మోహన్ రాజు, ఏపీఓ మృత్యుంజయరావు, ఎంపిటీసీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల శ్రమదానం

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలం చిన్నగొర్పాడు గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం శ్రమదానం చేపట్టారు. శ్రమదానంతో చిన్న గొర్పాడు గ్రామపంచాయతీ పరిధిలోని మద్దినాయనిపల్లి రోడ్డు నుండి కొత్త వడ్డిపల్లి మీదుగా గుడార్ల బండ వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మాట శ్రమదానం బాట అని ఆయన స్పూర్తితో తమ గ్రామంలోని రోడ్డును బాగు చేసుకోవడం కోసం కావునడు బిగించి శ్రమదానం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నాని నాయకులు రాజగోపాల్ నాయుడు, విశ్వనాథం నాయుడు, గిరి, నాగరాజ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ నిబంధలకు పాతర

వెలుగు సీసీ చెప్పిందే వేదం

విశాలాంధ్ర-బాలాయపల్లి: సెర్ప్ నిబంధనల కు విరుద్ధం గా ఓబీ (గ్రామ సంఘం అధ్యక్షురాలు)ని కొనసాగిస్తున్న వైనం మండలంలోని మన్నూరు గ్రామ సంఘంలో చోటుచేసుకుంది. గ్రామ సంఘంలో ఓబీగా ఎంపిక కావాలంటే స్వయం సహాయక సంఘంలో లీడర్లుగా ఉండాల్సి ఉంది. అయితే మన్నూరు గ్రామంలో సీసీకి అనుకూలంగా ఉండాలన్న ఉద్దేశంతో స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలిని గ్రామ సంఘం అధ్యక్షురాలిగా ఎంపిక చేసి కొనసాగించడంపై గ్రామంలోని పొదుపు సభ్యులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

పల్లె పండుగ కార్యక్రమంలో బొజ్జల సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలంలోని రేణిగుంట పంచాయతీ జ్యోతి నగర్, కరకంబాడి పంచాయతీలోని తారకరామా నగర్‌లో 36 లక్షల అంచనాలతో చేపడుతున్న నూతన సిమెంట్ రోడ్డు పనులను గురువారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ముందుగా పార్టీ కార్యకర్తలు స్థానికులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలుకుతూ సెలవాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి చేయటంలో ఇది తొలి అడుగు అని అన్నారు. మునుముందు మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. రానున్న 45 రోజుల్లో కొత్త పెన్షన్లు మంజూరు అవుతాయని గతంలో విచ్చలవిడిగా పెన్షన్లను ఇచ్చారని వాటిపై పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులైన వారికే పెన్షన్లు అందిస్తామని అన్నారు. మహిళలకు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి చంద్రన్న దీపావళి నుంచి ఉచిత గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణు చిరంజీవి, టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ బుజ్జి నాయుడు, రేణిగుంట క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదన్, టిడిపి మహిళా నాయకురాలు మేరీ, బుజ్జి నాయుడు, మునిరాజ, బాలాజీ, కృష్ణామూర్తి, వాసు, పాడి గజేంద్ర, రవేంద్ర, వెంకటాద్రి, మహేష్, వార్డ్ మెంబర్ ఎమ్ మునిరాజా, వెంకటరత్నం, రాజేంద్ర, మణి, ఈవోపీఆర్డి ప్రభురావు, ఏపీవో జ్యోతి శ్రీ, టెక్నికల్ అసిస్టెంట్ జయంతి, పంచాయతీ ఈవో మణి, రమేష్ బాబు తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సురుటుపల్లి ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి హుండీ లెక్కింపు ద్వారా ఆలయానికి 3,61,784 రూపాయలు ఆదాయం వచ్చినట్టు స్థానిక ఆలయ ఈవో లత పేర్కొన్నారు. దీంతోపాటు హుండీలు ద్వారా బంగారు 044.045 మి.గ్రా, వెండి 904.000 మీ.గ్రా.లు కానుక రూపంలో వచ్చిందన్నారు. ఆలయం నంది మండపం వద్ద తిరుపతి డివిజన్ దేవాదాయ తనిఖీదారులు పణిరాజశయన పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణాధికారిణి లత ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు సిబ్బంది ద్వారా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు కొనసాగింది. ఈ ఆదాయం 41 రోజులకు దేవస్థానము హుండీల లెక్కింపు ద్వారా వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలను దిక్కరించిన పాఠశాలలపై చర్యలు చేపట్టండి

ఏఐఎస్ఎఫ్ జిల్లాకు కన్వీనర్ మున్నా

విశాలాంధ్ర-పుంగనూరు: అల్పపీడన ప్రభావంతో వాతావరణ శాఖ వారి హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 17వ తేదీ గురువారం చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు, సంబంధిత యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను విధిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయినను కొన్ని పాఠశాలల్లో 10వ తరగతి స్పెషల్ తరగతులు నిర్వహిస్తూ కలెక్టర్ నిబంధనలను దిక్కరించడం జరిగిందన్నారు. అటువంటి పాఠశాలలపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ మున్నా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హై కోర్టు ఉత్తర్వులు బేఖాతరు

హై కోర్టు వాళ్లు ఇస్తారు పో ఉద్యోగం

విశాలాంధ్ర-బాలాయపల్లి: హైకోర్టు వాళ్లు ఇస్తారు పో ఉద్యోగం అంటూ ఓ సీసీ వివోఎ పై చిందులు వేసిన సంఘటన గురువారం వెలుగు కార్యాలయంలో చోటుచేసుకుంది. వివోఎల కథనం మేరకు మండలంలోని మన్నూరు, అలిమిలి, కయ్యూరు గ్రామసంఘాలకు చెందిన వివోఏలు మాధవి, వాణి, హజరత్తమ్మలు తమకు గ్రామసంఘం తీర్మానం ఇచ్చినా విధులకు రావద్దంటూ అక్రమంగా తొలగించారని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం వివోఎల విధులలో జోక్యం చేసుకోకుండా వారిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని వివోఎలు గత కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అదే క్రమంలో గురువారం వెలుగు కార్యాలయానికి వెళ్లి సీసీలను కలువగా నువ్వు కోర్టుకు వెళ్లావుగా హైకోర్టు వాళ్లు ఇస్తారు పో ఉద్యోగం అంటూ ఓ సీసీ వ్యంగాస్త్రాలు సంధించారని వివోఏలు విలేఖరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నిన్ను ఎవ్వరిని రమ్మన్నారు ఆఫీస్‌కు అంటూ అవమానించిందంటూ వివోఏ కన్నీటి పర్యంతమయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వివోఏలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-తడ: మండల కేంద్రమైన తడ కండ్రిగ బోడి లింగాలపాడు మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలు పాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. తడ ఎస్ఐ కొండప్ప నాయుడు సమాచారం మేరకు శ్రీకాళహస్తి రోడ్డులో వ్యాపారం నిర్వహిస్తున్న భవన్ లాల్ (40) మరియు సత్యవేడు మండలం కొల్లడం గ్రామానికి చెందిన ఢిల్లీ బాబు(59) తడలో సేవా సంస్థ నిర్వహిస్తున్నాడని భవన్ లాల్, ఢిల్లీ బాబు ఇరువురు తడ తాసిల్దార్ కార్యాలయంలో పని నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళ్తూ బోడి లింగాలపాడు మలుపు వద్ద మోటార్ సైకిల్ పై నిలబడి ఉండగా చెన్నై నుండి నెల్లూరు వెళ్తున్న కారు అతి వేగంగా వీరిని ఢీకొట్టడంతో ఢిల్లీ బాబు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలు పాలైన భవన్ లాల్ ను స్థానికులు మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు ఈ మేరకు తడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పలమనేరు: రూరల్ మండలంలోని కొల మాసనపల్లి పంచాయతీలో వాల్మీకి మహర్షి జయంతి వేడు కలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదటగా గొల్లపల్లి శ్రీ ఆరి మాను గంగమ్మ గుడి వద్ద నుండి వాల్మీకి మహర్షి చిత్రపటంను పుష్ప పల్లకిలో కోలాటాలు, చెక్క భజనలు, పిల్లన గ్రోవులు, బళ్లారి డ్రమ్స్, డిజె లతో కొలమాసనపల్లి పంచాయితీ లోని అన్ని గ్రామాల వాల్మీకి బోయలు కలిసి కొలమాసనపల్లిలో వాల్మీకి దేవాలయం వద్దకు ఊరేగింపుగా ఎంతో అంగరంగ వైభవంగా మెరివని కార్యక్రమం నిర్వహించారు. వాల్మీకి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుమూర్తి, గణేష్‌లు మాట్లాడుతూ... ఐక్యతతో కలిసి కట్టుగా పోరాడితే మన చిరకాల వాంఛ అయిన ఎస్‌టి హోదా అనేది సాధ్యం అవుతుందని ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం తప్పక మన కోరిక తీరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ పంచాయితీలోని వాల్మీకి సంఘ నాయకులు, బి.సి.నాయకుడు పూసల రవి, శంకర్, రామమోహన్, శ్రీనివాసులు, హరి ప్రసాద్, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

హరిత భర్త సాయిరెడ్డి మృతి

విశాలాంధ్ర-తొట్టంబేడు: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరిత భర్త చెన్ను సాయిరెడ్డి (33) గురువారం తుది శ్వాస విడిచారు. సాయిరెడ్డిది కేవీబీపురం మండలం కాళంగి ఆదరం. చెన్ను బ్రహ్మానందరెడ్డి, సుగుణమ్మ ఈయన తల్లిదండ్రులు. అమెరికాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిరెడ్డి సతీమణి హరిత (27) ఘటనా స్థలిలోనే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. సాయిరెడ్డి, హరిత దంపతుల మృతితో కాళంగి ఆదరం, చిట్టత్తూరులో విషాదం అలుముకుంది. కాగా హరిత కుటుంబ సభ్యులను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు. సాయిరెడ్డి, హరిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అమెరికా నుంచి సాయిరెడ్డి, హరిత భౌతిక కాయాలను తెప్పించడానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

అన్నపూర్ణమ్మకు ఎమ్మెల్యే ఘన నివాళి

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సిపిఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల రమణయ్య సతీమణి మోదుగుల అన్నపూర్ణమ్మ బుధవారం సాయంత్రం మృతి చెందారు. వేలూరు సిఎంసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. స్వగ్రామం సూళ్లూరుపేటలో గురువారం దహన క్రియలకు సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, పార్థసారథి, మోదుగుల అన్నపూర్ణమ్మ మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మోదుగుల రమణయ్యను వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. వీరితోపాటు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఏర్పేడు సిఐ జయచంద్రకి సన్మానం

విశాలాంధ్ర-ఏర్పేడు: ఏర్పేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ పై ఏర్పేడుకు సీఐగా వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరఫున మర్యాద పూర్వకంగా గురువారం ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఆయన్ను కలిసి, దుశ్శాలువాతో పుష్పగుచ్ఛం, అందించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగిగా ఉండి, పేద ప్రజలకు సహాయకారిగా ఉండి, ఉన్నత స్థాయి ఆఫీసర్‌గా ఎదగాలని జిల్లా సంఘం తరపున మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్ శ్రీనాథ్. తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ రేగంటి దేవానంద్, జనరల్ సెక్రెటరీ పీవీ సుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షురాలు సి.మంజుల, రాష్ట్ర కౌన్సిలర్, విజయలక్ష్మి, శ్రీకాళహస్తి డివిజన్ ప్రెసిడెంట్ ఎం.ఇందిరాదేవి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు 31తో ముగింపు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్, తిరుపతి జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ స్పందించి ముగిసిన గడువును తిరిగి పెంచారని చెప్పారు. ఈ నెల 25వ తేదీ వరకు ఎలాంటి ఫైన్ లేకుండా ప్రవేశాలు చేసుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు 200 రూపాయలు ఫైన్‌తో ప్రవేశాలు చేసుకోవటానికి అవకాశం కల్పించిందన్నారు. ఈనెల 30, 31వ తేదీన వెయ్యి రూపాయల ఫైన్‌తో దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. 31వ తేదీ తర్వాత ఎటువంటి పరిస్థితులలోనూ ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంచబడదన్నారు. ఓపెన్ స్కూల్ నందు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలు పొందాల్సినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలను ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలలో గాని, మండల విద్యాశాఖ కార్యాలయం, లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

హరితారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అమెరికాలోని రాండాల్ఫ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందిన శ్రీకాళహస్తి వాసి హరితా రెడ్డి(27) కుటుంబ సభ్యులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డి.భాస్కర్ రెడ్డి, లత దంపతుల కుమార్తె హరితా రెడ్డి అమెరికాలోని రాండాల్ఫ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డి.భాస్కర్ రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమెరికాలో ప్రమాదవశాత్తు మృతి చెందిన శ్రీకాళహస్తి వాసుల భౌతిక కాయాలను ఇండియాకు రప్పించడానికి తానా సభ్యులతో స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడి భౌతిక కాయలను త్వరగా రావడానికి ప్రభుత్వం తరఫున చేయాల్సిన సహాయం చేస్తామని తెలిపారు. వివరాల్లోకి వెళితే... తొట్టంబేడు మండలం చిట్టత్తూరు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డి.భాస్కర్ రెడ్డి, లత దంపతుల కుమార్తె హరితా రెడ్డిని ఏడాది కిందట శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ కాలనీకి చెందిన సాయి రెడ్డితో వివాహం జరిపించారు. వీరిరువురూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా అమెరికాలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో సోమవారం టూర్ నిమిత్తం స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా రాండాల్ఫ్ వద్ద కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులో ఐదు మంది ప్రయాణిస్తుండగా ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుల భౌతిక కాయాలను త్వరగా తీసుకువచ్చేలా అటు తానా సభ్యులతోను, ఇటు ప్రభుత్వం తరపున మాట్లాడి చర్యలు తీసుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శిగా టి.సుబ్రమణ్యం

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: పంచాయతీ కార్యదర్శుల బదిలీలో భాగంగా మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శిగా తొన్నాటి సుబ్రహ్మణ్యం గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి త్రివిక్రమ్ రావుకు బదిలీ ధ్రువపత్రాలు అందించారు అనంతరం పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ ఉపసర్పంచ్ రాజా, సచివాలయం సిబ్బంది శాలువతో సత్కరించి ఆహ్వానం పలికారు. ఈయన ఏర్పేడు మండలం మన్నసముద్రం పంచాయితీ కార్యదర్శిగా ఆయన విధులు నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారు. బదిలీలో భాగంగా మండల కేంద్ర కార్యదర్శిగా గ్రెడ్ 3 అధికారిగా బాధ్యతలు స్వీకరించారు అనంతరమైన మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు నాపైన ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

టిడిపితోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

విశాలాంధ్ర-ఏర్పేడు: తెలుగుదేశం పార్టీ తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత మాజీ ఏపీ సీడ్స్ డైరెక్టర్ కందటి శివశంకర్ రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలంలోని అంజి మేడు కోబాక తదితర గ్రామాల్లో పల్లె పండుగ వారోత్స వాలు కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. అంజిమేడులో జరిగిన భూమి పూజ కార్యక్రమంలో శివశంకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం పూర్తిగా రైతులను పేద ప్రజలను మర్చిపోయి నాయకుల స్వప్రయోజనాలకు బాసటగా నిలిచిందన్నారు. 2019 ముందు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాలను అనేక రకాలుగా అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాతే పల్లె పండుగ వారోత్సవాలలో కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. అంజిమేడు గ్రామంలో సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా కోపాక పంచాయతీలో 7 లక్షల రూపాయలు నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథక సంచాలకులు పిడి శ్రీనివాస ప్రసాద్, సూరి నాయుడు, భూపతి యాదవ్, శివాజీ రెడ్డి, గోపాల్ రెడ్డి, గంగుల నాయుడు ఎంపీటీసీ గౌరీ, విజయ శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత వెంకటాపురం వీఆర్వోగా కంద స్వామి

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: పాత వెంకటాపురం విఆర్ఓగా కంద స్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో తమ దృష్టికి వచ్చిన రెవిన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను సర్పంచ్ ఆర్.రాజా సెల్వి, ఎంపీటీసీ లారెన్స్, టిడిపి నాయకులు కుమార్ తదితరులు సన్మానించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర-పాకాల: వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు కార్యాలయంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, ఎంపీడీవో శశిరేఖ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీరు తొలగింపు

విశాలాంధ్ర-ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి నాగర్తమ్మ గుడి సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుమీద నాలుగు రోజులు పాటు కురిసిన వర్షానికి మోకాలు లోతు మురుగునీరు నిల్వచేరి వాహనాలకు, పాదాచార్లకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నడంతో స్పందించిన ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ చౌదరి మనుషులను ద్వారా తూములకు అడ్డుపడ్డ మొక్కను తీసి మురుగునీరు తొలగించారు.

తాగునీటి బోర్ వద్ద పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని ముక్కరవారి పల్లె పంచాయతీ ఆంధ్ర దళితవాడలో తాగునీటి బోరు వద్ద ఉన్న పరిసరాలను సర్పంచ్ గుణవతి లోకనాథం నాయుడు, కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్తను వీధుల్లో పడేయకుండా మీ ఇంటి వద్దకె గ్రీన్ అంబాసిడర్లు వచ్చినప్పుడు ఆ బండిలో వేయాలని సూచించారు. తాగునీటి బోరు శుభ్రంగా ఉండడం పై అక్కడ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ధర్మరాజు ద్రౌపతి అమ్మవారి గుడిలో అన్నదానం

రూ.15 లక్షలతో తేరు నిర్మాణం

విశాలాంధ్ర-కార్వేటినగరం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో కార్వేటినగరం మండలం లోని ధర్మరాజు ద్రౌపతి సమేత అమ్మవారి గుడిలో అన్నదాన కార్యక్రమం జరిగింది. గురువారం ఈ కార్యక్రమం స్థానిక ఎంపీటీసీ లతా బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గుడి నిర్మాణం చేపట్టి 14 సంవత్సరాలు పూర్తి అయినందున, గుడిలో ఉదయం విగ్రహముతులకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి, పూలతో సుందరంగా అలంకరించి, వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ దర్శన భాగ్యం కల్పిం చింది. కర్ణం వంశీ యులు సుమారు 15 లక్షలతో కొయ్యతో తయారుచేసిన కొత్త రథాని ఆలయానికి బహుకరించారు. సాయంత్రం ధర్మరాజు సమేత ద్రౌపతి అమ్మవారు పురవీధులలో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ సోమశేఖర్ తెలిపారు.

పల్లె పండుగలో శ్రీనివాస ప్రసాదు

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం శుక్రవారం ఉదయం గోపాలకృష్ణ పురం, సిరుగు రాజుపాలెంపురం పంచాయతీ పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీనివాస ప్రసాదు హాజరై సిసి, డ్రైనేజ్, రోడ్డు పనికి భూమి పూజ చేయడం జరిగింది. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆరవ వేపగుంట బాలాజీ గపంచాయతీ ప్రతినిధులు హరిగోపాల్, గంగాకుమార్, గంగయ్య, గోవింద స్వామి, రవి, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి: ఎంపీడీవో

విశాలాంధ్ర-కార్వేటినగరం: మండల పరిధిలోని 22 పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పారసుద్యాన్ని మెరుగుపరిచినట్లైతే రోగాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సీజన్లో వేడి నీళ్ల కాంచి తాగాలని సూచించారు. ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలోని కార్వేటినగరం, డిఎం పురం, ముక్కర వాణి పల్లెల్లో పారిశుధ్యం పై ప్రత్యేక కార్యదర్శులను పెట్టారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కార్యదర్శిలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగరత్నమ్మ, కార్యదర్శి గోపి, మనోజ్ కుమార్, సర్పంచులు ధనంజయ వర్మ, తులసి కుమారి, గుణవతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి పలువురి నివాళి

విశాలాంధ్ర-దొరవారిసత్రం: దొరవారి సత్రం మండల పరిధిలోని తనయాలి గ్రామ మాజీ సర్పంచ్ చెన్నూరు రమణారెడ్డి (62) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సులూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డిసిసి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, పలువురు మండల శాఖ అధికారులు, నాయకులు మృతి దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నూరు రమణారెడ్డి పలుదపాలుగా గ్రామ సర్పంచిగా ఎన్నికై ఎన్నో అభివృద్ధి పనులను చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు. రమణారెడ్డి మృతి చెందాడు అనే విషయం తెలుసుకున్న తనయాలి, బూదూరు గ్రామంలోని ప్రజలు వందలాది మంది ఆయన మృతదేహం వద్ద కన్నీరు మున్నీరయ్యారు.

ప్రతిగ్రామంలో విధిగా శానిటేషన్ చేపించండి

నాయుడుపేట ఎంపీడీవో సురేష్ బాబు

విశాలాంధ్ర-నాయుడు పేట: సైక్లోన్ ప్రభావం వల్ల ప్రతి గ్రామంలో వర్షపు నీరు పారటం వల్ల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నందున ప్రతి పంచాయతీలోని గ్రామాలలో విధిగా శానిటేషన్ చేపించాలని పంచాయతి కార్యదర్శులకు గురువారం నాయుడుపేట మండల అభివృద్ధి అధికారి సురేష్ బాబు ఆదేశాలు జారీ చేశారు. వర్షం పూర్తిగా నిలిచిపోయిన అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా మురుగు, చెత్త డ్రైనేజీలో పేరుకుపోవటం వలన దోమలు గుడ్లు పెట్టి లార్వా ఉత్పత్తి చేయటం ద్వారా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని సూచించారు. ముందస్తుగా లార్వా దశలోనే పాగింగ్ చేసి దోమలను చంపేయాలని తెలిపారు. ప్రతి పంచాయతీలోని గ్రామాల్లో విధిగా శానిటేషన్ చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం విధిగా పని చేయాలని కోరారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి, ఒకవేళ రోడ్లపై నిలిచిన నీటిని బయటకు తోడేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు అన్ని పరిశుభ్రంగా కడిగించాలి. ట్యాంక్ లో నీరు నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేపించి పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.

ఓటేరులో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పర్యటన

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీలోకి వరద నీరు చేరింది. సమాచారం తెలుసుకున్న తుడా మాజీ ఛైర్మన్, వైసీపీ యువ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం సాయంత్రం పర్యటించారు. గుడిసెల్లో నివాసముంటున్న మహిళలను ఓదార్చారు. దినసరి కూలిలుగా జీవనం సాగించే అక్కడి వారందరూ గత మూడు రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. తినడానికి అవసరమైన బియ్యం, పప్పు, ఆయిల్, ఎర్రగడ్డలు, ఉల్లిగడ్డలు రవ్వ, శనగపిండి, మసాలా దినుసులతో కలిసి 14రకాల నిత్యావసర సరుకులను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. నిరుపేదల ముఖాల్లో వెల్లివెరసిన ఆనందం.. గంగిరెడ్డులను ఆదిస్తూ దినసరి కూలీలుగా జీవనం సాగించే ఆ కాలనీ వాసులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ఆకలి తీర్చడంతో అక్కడి మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అన్నం పెట్టే వారిని వదులుకున్నామని, అయినా మేము కష్టంలో ఉన్నామంటే పరుగెత్తుకుని వచ్చారంటూ పలువురు మహిళలు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని పట్టుకుని కన్నీరు పెట్టుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం మోహిత్ రెడ్డి కాలనీలో పర్యటిస్తూ కష్టాల్లో ఉన్న వారికి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ, వైస్ ఎంపీపీ మాదవ రెడ్డి, లింగేశ్వర నగర్ సర్పంచ్ కోటీశ్వరరెడ్డి, వైయస్సార్సీపీ నేతలు బత్తల సుబ్రమణ్యం, రాజు యాదవ్, గంగిరెడ్డి, నాగ భూషణం, ముదిరాజ్, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, చెంచు మోహన్ యాదవ్ లతో పాటు మరికొంతమంది యువకులు పాల్గొన్నారు.

ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్ విడుదల

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ఇసుజు మోటార్స్ ఇండియా ఏఐఎస్-125 టైప్ సి అంబులెన్స్ నిర్దేశనలతో పూర్తిగా-నిర్మించబడిన ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్ ని మార్కెట్లోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషిమటో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల ఆ రహదారులకు అనుగుణంగా మా కొత్త అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సరికొత్త పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో పాటు రోగికి అవసరమైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారము కొరకు వినియోగదారుడు 1800 4199 188 (టోల్ ఫ్రీ) ను సంప్రదించాలని కోరారు.

బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: పుత్తూరు బలిజ కులస్తుల ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పిన గొప్ప చక్రవర్తి, చంద్రగిరి పరిపాలన దక్షుడు, బలిజ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణదేవరాయల వారి 495 వర్ధంతిని పురస్కరించుకొని బలిజ సంఘం భవనమునందు రాయలవారి చిత్రపటానికి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులు జోహార్లుతో సంఘ నాయ కులు ఘనంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం పుత్తూరు మండల బలిజ సంఘం అధ్యక్షుడు పి.శివయ్య, మెకానిక్ శివ ఆధ్వర్యంలో జరిగినది. సంఘ నాయకులు పి.గోపి రాయల్. కే.రాజేంద్ర. జీ.కృష్ణయ్య. పొదగంటి ప్రకాష్. ప్రముఖ న్యాయవాది యూఎస్ రాయుడు. మునయ్య. సత్య. తోట రఘు. తడుకు రాజేంద్ర. మెడికల్ షాప్ నాగయ్య కుమారుడు, సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని రాయలవారి వర్ధంతి కార్యక్రమాన్ని చేయడం జరిగినది.

రోడ్డు పక్కన మందు షాపుకు అనుమతిని ఇవ్వని గ్రామస్తులు

విశాలాంధ్ర-వరదయ్య పాళ్యం: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం చిన్న పాండురు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న బ్రాందీ షాపును, ప్రస్తుత ప్రభుత్వ లైసెన్స్ దారులు, ఇచ్చట పెట్టుటకు, ప్రయత్నిస్తున్నారు. ఈ బ్రాందీ షాపు రోడ్డు పక్కన ఉన్నందువలన, శ్రీ సిటీ పోయే ఉద్యోగస్తులకు, ప్రభుత్వ బస్సులకు, పిల్లలకు, ప్రైవేటు వాహనదారులకు, కాలినడకపోయే ప్రయాణికులకు చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది. అలాగే మద్యం ఎక్కువగా సేవించి వాహనాల కింద పడి ప్రమాదం జరిగే అవకాశాలను ఉన్నాయని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే బ్రాందీ షాప్‌ను రోడ్డుకు దూరంగా ఉండవలసినదిగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సీఐని ప్రాధేయపడుతున్నారు.

19న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్ 2

విశాలాంధ్ర-తిరుపతి: ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సు ఘనంగా నిర్వహించింది. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మేఘసందేశం సీరియల్ నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చిందన్నారు. యాంకర్ వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్తో వీక్షకుల్లో ఉత్సాహాంనింపిందన్నారు. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగిందన్నారు. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారన్నారు.తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫార్మెన్స్ షోకి హైలెట్గా నిలిచాయన్నారు. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మీ్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ, సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తు ప్రతిష్టాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకావాలన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి



విశాలాంధ్ర-చంద్రగిరి: నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి తెలిపారు. సాధారణ తనిఖీ లలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ఏరియా ఆసుపత్రి) ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అన్ని విభాగాలను తనిఖీ చేసిన ఆయన పారిశుధ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంత మంది రోగులు అడ్మిషన్లో వున్నారు. ఓపిలు ఏ మేరకు వస్తున్నాయి. రోజువారీ రక్తపరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహణ వంటి అంశాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న వైద్య సేవలను వివరించారు.

తాగునీటి పథకాలను పరిశీలించిన డిఈ నందకుమార్

విశాలాంధ్ర-చిట్టమూరు: గత కొద్ది రోజుల నుండి బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి దీని ప్రభావం తుపానుగా మారి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో గూడూరు ఆర్డబ్ల్యూ ఎస్ డీఈ నందకుమార్ పలు మండలాల్లో తాగునీటి పథకాలను పరిశీలించారు. 14వ తారీకు నుండి వర్షాలు మొదలైనది మొదలుకొని తుఫానుగా మారి పెను ప్రమాదం సృష్టించబోతుందని వాతావరణ శాఖ అధికారులకు తెలపడంతో అప్రమత్తమైన తాగునీటి సరఫరా విభాగం అధికారులు ప్రతి నీటి సరఫరా స్కీమ్ వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసి కరెంట్ సప్లై చేసి తాగునీటి సరఫరా చేయాలని అధికారులు ఆదేశించడంతో గురువారం గూడూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్ చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లోని పలు త్రాగునీటి పథకాలను జనరేటర్ ఏర్పాటు చేయడాన్ని పరిశీలించారు. ఆయన వెంట చిట్టమూరు, కోట, వాకాడు ఏఈలు ఉన్నారు.

గుట్కా దొంగల గుట్టు రట్టు

విశాలాంధ్ర-గుడిపాల: దారి కాచి వాహనాల దోపిడీకి పాల్పడుతున్న ముఠాను గుడిపాల ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు చిత్తూరు డిఎస్పి సాయినాథ్ వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడు తెలిపిన వివరాల మేరకు గత నెల 27వ తేదీన గుడిపాల పోలీస్ స్టేషన్ పరిధిలో పసుమంద కమ్మతిమ్మపల్లి రోడ్ నందు గల కందగిరి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కమ్మ తిమ్మపల్లి వైపుగా వెళుతున్న ఒక బెలెనో కారును మరియు అందులో ఉన్న గుట్కా ప్యాకెట్లను ఓ ముఠా దారి కాచి కారుతో పాటుగా తీసుకెళ్లినట్లు గుడిపాల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు కావడంతో డిఎస్పి సాయినాథ్ ఆధ్వర్యంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ నాయుడు మరియు గుడిపాల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ ద్వారా పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పడి దారి దోపిడి పై విచారణ నిర్వహించి గురువారం దోపిడీకి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సందర్భంగా నిందితులలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన షఫీ(36) జావిద్(26) షాబుద్దీన్(32) రాజేష్ ఖన్నా(23) ఆసిఫ్ బెగ్(33) లను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్ కు తరలించారు ఈ సందర్భంగా మరో ఇద్దరు ముద్దాయిలు పరారీలో ఉన్నట్లు వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు ముద్దాయిల వద్దనుండి చోరీ కాబడిన బెలెనో కారును దొంగతనానికి ఉపయోగించిన రెండు టాటా ఏస్ వాహనాలను ఆరు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్సై రామ్మోహన్, సిబ్బందిని డిఎస్పీ అభినందించారు. ఈ దేకాయిట కార్యక్రమంలో టెక్నికల్ టీం దేవరాజులు రామారావు, ఋషి కేశ్ రెడ్డి, గోపి, రవి,జ్యోతి రెడ్డి వేణు ఇతర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట కష్టాలపై సామాజిక గ్రామసభలు

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం పానాటూరు రైతుసేవ కేంద్రంలో ఖరీఫ్ 2024 ఈ పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించాము. రైతులు సాగుచేసిన అన్ని పంటలను ఈ పంట యాప్ నందు నమోదు చేసి 290 ఎకరాలకు 161 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి చేయడం జరిగింది. గ్రామ సభలో రైతు పేరు, తండ్రి పేరు, ఈ పంట బుకింగ్ ఐడి, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు, సాగుచేసిన పంట, పంటరకము. విత్తిన తేదీ, పంటసరలి, రైతులకు చదివి వినిపించడం జరిగింది. పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 20వ తేదీలోగా రాతపూర్వకంగా అర్జీ ఇస్తే మార్పులు చేర్పులు చేసి తుది జాబితాను తయారు చేస్తామని రైతులకు తెలిపారు. ఈ పంట నమోదు డేటా ఆధారంగానే పంటలకు సున్నావడ్డీ పంట రుణాలు, పంటలకు బీమా, పంట నష్టపరిహారం, రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది. ఈ గ్రామసభకు మండల వ్యవసాయ అధికారి వి.మాధవి, గౌరవ గ్రామ సర్పంచ్ పల్లవి మధుసూదన్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మంజునాథ్, వీ.ఏ.ఏ తులసిరాం రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

టొయోటా కిర్లోస్కర్ ఫెస్టివల్ లిమిటెడ్ పరిచయం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో విడుదల చేసినప్పటి నుండి అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం నిబద్ధత చిహ్నంగా ఉంది. టిజిఎ ప్యాకేజీని కలిగి ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయంతో మా కస్టమర్లకు మరింత వ్యక్తిగతీకరించిన ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అన్నారు. ఈ ప్రత్యేక ఆవిష్కరణలో భాగంగా, 31 అక్టోబర్ 2024 వరకు భారతదేశంలోని డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంచబడిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను ఎంచుకునే కస్టమర్‌ల కోసం రూ. 50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీని టికెఎం అందిస్తోంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తలతోనే ఇబ్బందులు తప్పాయి

- నగర శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, అందరూ కలిసికట్టుగా పని చేయడంతో తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేయగలిగామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. లోతట్టు ప్రాంతాలైన పూలవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్ ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న సహాయక చర్యలను, పునరావాస కేంద్రాలను గురువారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా 30 ఎం.ఎం. వర్షపాతం నమోదయిందన్నారు. అదేవిధంగా కొండలపై నుండి ఎక్కువ నీరు రాకపోవడంతో కొంతమేర ఇబ్బందులు తప్పాయని అన్నారు. నెల రోజుల ముందుగానే నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త చెదారం, మట్టి తదితరాలను జెసిబి లతో తొలగించాలని అన్నారు. దీంతో ఎక్కడా నీరు రోడ్లపైకి రాకుండా సజావుగా వెళ్ళిపోయాయని అన్నారు. లీలామహల్ కూడలి, కరకంబాడి మార్గం ప్రాంతాల్లో రోడ్లపై రాకుండా నీటి వినాయక సాగర్ మళ్లించామని అన్నారు. అలాగే లోతట్టు ప్రాంతమైన కొరమేనుగుంట లోకి నీరు ఎక్కువ రాకుండా కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే లక్ష్మీపురం కూడలి, అండర్ బ్రిడ్జి కింద నీరు చేరిన వెంటనే మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు నీరు తొలగించమని అన్నారు. దీంతో ఎక్కడా నీరు నిలవలేదని అన్నారు. గురువారం నుండి వర్షాలు తగ్గడంతో పారిశుధ్య పనులు విస్తృతంగా చేపట్టామని అన్నారు. అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం, పాగింగ్ చేయడం చేస్తున్నామని అన్నారు. అలాగే త్రాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రోజూ క్లోరినేషన్, నీటి సాంద్రత పరీక్షలు చేసి సరఫరా చేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ కాలువలపైన నిర్మాణాలు చేయడం వలన ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. వాటిని తొలగిస్తామని అన్నారు. అలాగే కాలువల్లో పాడైన బెడ్లు, డైపేర్స్, చెత్త వేయడం వలన నీరు రోడ్లపైకి వస్తున్నాయని అలా వేయవద్దని ప్రజలను కోరారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, సి.పి.ఓ. దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి, డిఈలు తదితరులు ఉన్నారు.

సీఎం చంద్రబాబుకి ఆర్సీవై ఘాటు లేఖ

- తిరుమల పవిత్రతపై హెచ్చరిక
- రాజకీయం కావాలా.. పరిష్కారం కావాలా అంటూ నిలదీత
- తదుపరి కార్యచరణకు సిద్ధమని ప్రకటన
- తొలి లేఖపై స్పందన లేకపోవడంపైనా ప్రశ్నలు

విశాలాంధ్ర-పుంగనూరు: తిరుమల పవిత్రత.., పరిరక్షణ ధ్యేయంగా రాజకీయాలకి అతీతంగా అడుగులు వేస్తున్న బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ మరో సంచలనానికి తెరతీశారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ రోజు ఓ ఘాటు లేఖ రాశారు.. తిరుమల నెయ్యి అంశంపై పరిష్కార మార్గాలు సూచిస్తూ పది రోజుల కిందటే రాసిన లేఖపై ముఖ్యమంత్రి నుండి స్పందన లేకపోవడంతో.. ఇప్పుడు ఆ అంశాలను ప్రస్తావిస్తూ మరి కొన్ని అంశాలను చేర్చారు. రాజకీయాలను పక్కన పెట్టి తిరుమల పవిత్రత, పరిరక్షణ విషయంలో చర్యలు తీసుకోకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖ పూర్తి సారాంశం ఇది? ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వర్యులు.. నారా చంద్రబాబు నాయుడు కి.. విషయం: తిరుమల పవిత్రత, పరిరక్షణపై మీకు రాజకీయం కావాలా..? పరిష్కారం కావాలా..? అయ్యా.. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో కొన్ని కీలక సూచనలు, సలహాలతో మీకు గతంలోనే (అక్టోబరు 5న) ఒక లేఖను రాసాను. ఆ లేఖలో తిరుమల వేంకటేశ్వర స్వామి వారి పట్ల నాకు, మీకు ఉన్న అనుబంధాన్ని చాలా స్పష్టంగా గుర్తు చేసాను.. మన పూర్వీకుల, మన అదృష్టం కొద్దీ ఆ స్వామి వారిని తాకిన గాలిని పీల్చి, ఆ స్వామి కొండల నీడన, ఆ స్వామి వెలసిన గడ్డపై పుట్టి, పెరిగాము.. ఆ స్వామి పట్ల భక్తి, ఆ కొండల పవిత్రత పట్ల అంకితభావం, ఆ క్షేత్రం పరిరక్షణ పట్ల శ్రద్ధ విషయంలో నేను ఒకింత కూడా రాజీ పడను, మీరు కూడా పడరనే నమ్మాను.. అందుకే మీకు లేఖల ద్వారా విషయాన్ని తెలియజేస్తున్నాను. కానీ మీలో అవేం కనిపించడం లేదు, ఎందుకనగా..! రాజకీయమా.. పరిష్కారమా..? తిరుమలకు ఇప్పుడు అతి పెద్ద సమస్య నెయ్యి.. స్వామి వారి దీపం, నైవేద్యం, భక్తులకు ఇచ్చే ప్రసాదాలు అన్నిటికీ వినియోగించే నెయ్యి విషయంలో సాక్షాత్తు మీరే ఒక సంచలన ఆరోపణ చేసి, కోట్లాది మంది భక్తుల మనసు ముక్కలు చేశారు.. మరి ఆ నెయ్యి కల్తీ లేకుండా శాశ్వత మార్గమేది..? కాంట్రాక్టరుని మారిస్తే సరిపోతుందా..? సీబీఐ, సిట్ విచారణ చేస్తే సరిపోతుందా..? మళ్ళీ భవిష్యత్తులో మరో పార్టీ అధికారంలోకి వచ్చి ఇదే తరహాలో ఆరోపణలు చేస్తే భక్తుల మనోభావాలు ఏమవ్వాలి..? దీనికి శాశ్వత కట్టడి ఎప్పుడు..? శాశ్వత ముగింపు ఎప్పుడు..? శాశ్వత పరిష్కారం ఎప్పుడు..? "రాజకీయ నాయకుడు రాజకీయమే చేస్తాడు.. మీకంటే గొప్ప అనుభవమున్న, తెలివైన రాజకీయ నాయకుడు లేకపోవచ్చు.." కానీ స్వామి వారి విషయంలో తగదు కదా.. ఇది ఒక మతం మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల మంది మనసు, ఆలోచనలు, భక్తి, శ్రద్ధలకు సంబంధించిన విషయం కదా.. మీకు ఈ విషయంలో రాజకీయం కావాలా..? పరిష్కారం కావాలా..? తిరుమల వివాదంలో మీలో ఇప్పటి వరకు రాజకీయం కనిపించింది తప్ప పరిష్కారం కనిపించలేదు! మీకు పరిష్కారం కావాలి అంటే.. గతంలో నేను రాసిన లేఖలో లేవనెత్తిన రెండు కీలక అంశాలపై మీ నుండి సానుకూల స్పందన ఆశిస్తున్నాను. భవిష్యత్తులో మళ్ళీ ఎటువంటి సమస్యలు తలెత్తని పరిష్కార మార్గాలుగా నేను ప్రతిపాదించిన రెండు అంశాలు మరోసారి గుర్తు చేస్తున్నాను..! నెయ్యి బయట కొనుగోలు చేసే కంటే సొంతంగా తయారు చేసుకోవడం అత్యుత్తమ మార్గం.. మీ ప్రభుత్వం దీనికి సిద్ధమైతే నేనే స్వయంగా నా తరపున వేయి గోవులను ఇస్తాను. అలాగే మరో లక్ష గోవులను ఉచితంగా సమకూర్చే బాధ్యత తీసుకుంటాను. నేను వేయి ఇవ్వడంతో పాటూ, నా లాంటి భక్తులను సంప్రదించి సమీకరించగలను. మీరు ఏర్పాటు చేయబోయే తిరుమల దేవస్థానం పాలకమండలిలో చైర్మన్ సహా సభ్యులు అందరూ ఆధ్యాత్మిక గురువులు, ధార్మిక ప్రతినిధులుగా ఉండేలా చూడగలరని మనవి. రాజకీయ, పారిశ్రామిక, కార్పొరేట్ రంగాలకు చెందిన వ్యక్తులను ఈ బోర్డులో స్థానం కల్పించకుండా ఆధ్యంతం భక్తి, శ్రద్ధలతో స్వామిని కొలిచే నిజమైన భక్తులకు మాత్రమే స్థానం కల్పిస్తారని ఆశిస్తున్నాను. అవసరమైతే మిమ్మల్ని నేరుగా కలిసి వీటిపై మరింత స్పష్టంగా, వివరంగా, శాశ్వత పరిష్కార మార్గాలుగా, పూర్తిగా వివరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. "ముఖ్యమంత్రి గారూ మీకు తిరుమల విషయంలో రాజకీయం కావాలో.. పరిష్కారం కావాలో తేల్చుకుంటే మంచిది. మౌనంగా ఉండడం మంచిది కాదు! స్పష్టమైన నిర్ణయం ప్రకటించి మీ నిబద్ధత చాటుకోండి.. మౌనమే సమాధానం అయితే, మీ నిర్ణయంలో స్పష్టత ఏమి లేకపోతే మేము మా భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేసుకుంటాం. తిరుమల పవిత్రత, పరిరక్షణ, ప్రక్షాళన కోసం నేను చేస్తున్న ఈ పోరాటం మధ్యలో వదిలేది కాదు..! డెయిరీ ఏర్పాటు విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుని.., తిరుమల పవిత్రతకు శ్రీకారం చుట్టి.. చరిత్రలో నిలిచిపోతారో.. లేదా రాజకీయ స్వార్థం చూసుకుని గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయం, స్వార్థం, ప్రయోజనం చూసుకుంటారో మీ ఇష్టం.. నేను మాత్రం ఈ అంశాన్ని వదిలిపెట్టను, మీ నిర్ణయం ఆధారంగా నా తదుపరి కార్యాచరణ సిద్ధం చేసుకుంటాను" బోడె రామచంద్ర యాదవ్, ఆ ఏడుకొండల నీడన పెరిగిన శ్రీవారి భక్తుడు!

తపస్సు వలన ఋషిగా మారిన వాల్మీకి మహర్షి

- జిల్లా జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు: వాల్మీకి మహర్షి బోయకులంలో జన్మించి తన తపస్సు వలన ఋషిగా మారారని, సుమారు 23 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించారని జిల్లా జాయి ంట్ కలెక్టర్ జి. విద్యాధరి పేర్కొన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి వాల్మీకి జయంతి సందర్భంగా జేసి జిల్లా సచివాల యంలోని పాత గ్రీవెన్స్ హాల్ నందు వాల్మీకి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిం చారు.ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ వాల్మీకి ప్రచేత ఋషికి జన్మించారని, ప్రచేతనుడు తనకు మారుడికి రత్నాకర అని పేరు పెట్టారన్నారు.రత్నాకరుడు చిన్న వయసులో అడుకోవ దానికి అడవికి వెళ్ళి తప్పిపోయి వేటగాడికి దొరికి, వేటగాని వృత్తినే ఎంచుకుని, దారిదోపి డీకి పాల్పడేవారన్నారు. నారదమహా ముని రత్నాకరునికి మంచి మాటలు చెప్పి మరా మరా అని జపం చేయమని బోధించడం జరిగిందన్నారు. అలా జపం చేస్తుండగా తన శరీరం అంతా పుట్ట నిర్మించబడుతుందని, దీనితో రత్నాకరుని పేరు వాల్మీకిగా మారిందన్నారు. వాల్మీకి కి శ్రీ రాముని పై అపారమైన భక్తి ఉందని, ఈ భక్తి మార్గమే రామాయణ మహాకావ్య రచనకు ఆజ్యం పోసిందన్నారు. సుమారు 23 వేల శ్లోకాలతో 7 ఖాండాలతో రమ్యాతి రమ్యంగా రామాయణాన్ని రచించారన్నారు. అటువంటి మహానీయుడిని స్మరించుకుంటూ ఆశ్వయుజ పౌర్ణమి రోజున వాల్మీకి జయంతి జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమమరియు సాధికారత అధికారి రబ్బానీ బాష,ఈడి బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ ,బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు సంబంధిత అధికారులు హాజరయ్యారు.

స్వర్ణముఖికి జలకళ

విశాలాంధ్ర - వాకాడు: స్వర్ణముఖి జలకళ మండల కేంద్రంలో ఉన్న స్వర్ణముఖ నదికి గురువారం సాయంత్రం జలకళ ఏర్పడినది. గత మూడు రోజుల గా తుఫాను వలన భారీ వర్షాలు కురుస్తుండటం, నదీ పరివాహక ప్రాంతంలోనూ భారీ వర్షాలు కురుస్తుండముతో స్వర్ణముఖి నదిలోకి భారీగా వరద నీరు వస్తున్నది. ముందస్తుగా ఇరిగేషన్ అధికారులు బ్యారేజ్ కు చెందిన అన్ని గేట్లను మూసివేసి, తూపులి హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి కుడి కాలువ ద్వారా స్వర్ణముఖి జలాలను చెరువులకు మళ్లిస్తున్నారు. వరద ప్రవాహం ఎక్కువైతే కొన్ని గేట్లు ఎత్తి నీరును విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలో మాత్రమే స్వర్ణముఖి నదిలోకి వరద ప్రవాహం ఉంటుంది. ఈ ఏడాది అక్టోబర్ నెలలోనే స్వర్ణముఖి జలకళ ఏర్పడడంతో స్వర్ణముఖి బ్యారేజీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పదివేల ఎకరాలకు స్వర్ణముఖి జలాలు సాగు నీరుగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా మూడు మండలాల ప్రజలకు త్రాగునీరుకు పరోక్షంగా ఉపయోగపడతాయి. నది లోకి వస్తున్న వరద నీరు వృధా చేయకుండా అన్ని చెరువులకు జలాలను మళ్లించాలని రైతులు కోరుచున్నారు. స్వర్ణముఖి జలకల వచ్చి పడింది మండల కేంద్రంలో ఉన్న స్వర్ణముఖ నదికి గురువారం సాయంత్రం జలకళ వచ్చిపడింది గత మూడు రోజుల గా తుఫాను వలన భారీ వర్షాలు కురుస్తుండటం నదీ పరివాహక ప్రాంతంలోనూ భారీ వర్షాలు కురుస్తుండముతో స్వర్ణముఖి నదిలోకి భారీగా వరద నీరు రావడతో ముందస్తుగా ఇరిగేషన్ అధికారులు బ్యారేజ్ కి చెందిన అన్ని గేట్లను మూసివేసి తూపులి హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి కుడి కాలువ ద్వారా స్వర్ణముఖి జలాలను చెరువులకు మళ్లించారు.వరద ప్రవాహం ఎక్కువైతే కొన్ని గేట్లు ఎత్తి నీరును విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.ప్రతి ఏడాది నవంబర్,డిసెంబర్ నెలలో మాత్రమే స్వర్ణముఖి నదిలోకి వరద ప్రవాహం వస్తుందని ఈ ఏడాది అక్టోబర్ నెలలోనే స్వర్ణముఖి జలకళ ఏర్పడడంతో స్వర్ణముఖి బ్యారేజీ పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.దాదాపు పదివేల ఎకరాలకు స్వర్ణముఖి జలాలు నుంచి సాగు నీరుగా ఉపయోగపడతాయి.అంతేకాక మూడు మండలాల ప్రజలకు త్రాగునీరుకు పరోక్షంగా ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తొండమనాడు చెరువును పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు చెరువును గురువారం తిరుపతి జిల్లా కలెక్టరు డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పరిశీ లించారు. వర్షాలకు ముందు తక్కువ నీరు నిల్వ ఉన్న తొండమనాడు చెరువు ప్రస్తుతం పూర్తి స్థాయిలో (229.48 ఎంసిఎఫ్టీలు) నిండి కలుజు పారుతోంది. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహాన్ని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మదన గోపాల్, ఈఈ రాధాకృష్ణ, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితర సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. సదరు చెరువు పూర్తి స్థాయిలో నిండడం ద్వారా 4,386 ఎకరాల ఆయక ట్టుకు ఎంత గానో ఉపయోగం కానున్నదని కలెక్టర్ కు అధికారులు వివరించారు. డీసిల్టేషన్ చేపడితే రైతుల పొలాలకు సాఫీ గా నీరు అందుతుందని అధికారులు తెలపగా నిధులు సమకు రుస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు మీడియాతో మాట్లాడు తూ... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులు తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో శ్రీకాళహస్తి, ఏర్పేడులో 8 నుంచి 9 సెం.మీ ల వర్షం కురిసింద న్నారు. దీని ద్వారా పలు చెరువులలో నీరు చేరిందన్నారు. వర్షాలకు మునుపు తొండమనాడు చెరువులో 0.1టి.ఎం.సి నీరు నిల్వ ఉండే దని... ఇప్పుడు 0.5 టిఎంసి ల నీరు నిల్వ ఉంటూ కలు జు పారు తోందన్నారు. దీని ద్వారా 14 గ్రామాల పంటలకు చాలా ఉపయోగ కరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో 350 పై చిలుకు ఇళ్లలో నీరు చేరిన నేపథ్యంలో వారిని పునరావాస కేంద్రాలలో ఉంచి వారికి భోజనం, త్రాగు నీరు, మందులను అందించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. మురుగు నీటిని వినియోగించుకుంటే చాలా మంచిదని ము ఖ్యమంత్రి ఎప్పుడు చెబుతుం టారన్నారు. ఈయన వెంట శ్రీకాళ హస్తి తహసీ ల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

వాల్మీకి మహర్షి రచించిన "రామాయణం మహాకావ్యం" సమస్త మానవాళికి ఆదర్శం : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురు వారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాల యంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరా యు డు శ్రీ వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూల మాల వేసి, ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భ ంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రత్నాక రుడు అనే ఒక సాధారణ వ్యక్తి నారద మహర్షి ఉపదేశించిన తారక మంత్రం ను జపిస్తూ, సంస్కృత సాహి త్యంలో సంపూర్ణ జ్ఞానం పొంది, వాల్మీకి మహ ర్షిగా మారిపో యా రు. ఫలితంగా సమస్త మానవాళికి ఆదర్శప్రా యమైన శ్రీ రామా యణ మహా కావ్యాన్ని సంస్కృతంలో రచించి సంస్కృత ఆదికవిగా పేరు పొందా రన్నా రు.వాల్మీకి జయంతి రోజు ఆ మహాను భావుని జీవిత విశేషాలు తెలుసు కొని, ఒక ఆదర్శ గురువుగా ఆయన చూపిన మార్గ ంలో నడవడమే ఆ మహర్షికి మన ఇచ్చే నిజమైన గురు దక్షిణ అనీ, ఇలాంటి మహ నీయుని వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీలు వెంక ట్రావు పరిపా లన, రవి మనోహ రచారి శాంతి భద్రతలు, శ్రీనివాసరావు సాయు ధ దళం, డీఎస్పీలు గిరిధర ఎస్బి, రమణ య్య ఏఆర్, ఏ.ఓ జయ లక్ష్మి, సీఐలు ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎ స్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయఅధికారులు,సిబ్బందిపాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయానికి డబుల్ రోడ్డును నిర్మించండి

ఎమ్మెల్యే బొజ్జలను కోరిన ఆలయ కమిటీ సభ్యులు

విశాలాంధ్ర -ఏర్పేడు: భారతదేశంలో మొదటి శివాలయం గా గుర్తింపు పొందిన గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యంగా పాపానాయుడుపేట నుండి గుడిమల్లం వరకు డబ్బుల రోడ్డును నిర్మించడానికి కృషి చేయాలని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గిరినాయుడు ఎమ్మెల్యే బొజ్జలను కలిసి కోరారు. ఈ మేరకు గురువారం గిరినాయుడు ఎమ్మెల్యే బొజ్జలకు వినతి పత్రాన్ని అంది ంచారు.. ఈ సందర్భంగా గిరినాయుడు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో మాట్లాడుతూ గుడిమల్లం ఆలయానికి రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు భక్తుల సౌకర్యార్థం డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గుడిమ ల్లం ఆలయానికి రోడ్డు నిర్మా ణం సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు... ఈ సమావేశంలో టిడిపి నేతలు ధనంజయులు నాయుడు మోహన్ నాయుడు నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు

రైతుల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు : ఎంఎల్సీ

విశాలాంధ్ర - రామకుప్పం : రైతుల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరుగిందని తద్వారా అన్నదాతల అభి వృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు వివిధ పథకాలకు శ్రీకారం చుట్టి రైతులకు రాయితీ పై రుణాలు మంజూరు చేసి ప్రోత్సాహకాలు అం దించడం తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎంఎల్సి కంచర్ల శ్రీకాంత్ మరియు ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మరియు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి లు పేర్కొన్నారు మండల పరిధిలోని వంద్యాల మడుగు పంచాయతీ పరిధిలోని ఎస్ గొల్లపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రత్యేకంగా గోకులాల షెడ్ల నిర్మాణం తో పాటు గొర్రెలు, కోళ్ల తదితర షెడ్లను నిర్మించుకోవడానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు నిర్మించుకునేందుకు వెసులుబాటు కల్పించడం జరుగిందని ఇందులో భాగంగా మొదటి విడతగా నియోజవర్గ పరిధిలో ప్రారంభించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని నిర్మాణాలు జరుగుతుందని పేర్కొన్నారు అనంతరం ఎస్ గొల్లపల్లి బస్టాండ్ నుండి గంగమ్మ దేవాలయం వరకు సిసి రోడ్ నిర్మాణానికి పూజలు చేసి ప్రారంభించారు కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి , సీతాపతి , చలపతి, చిన్న కృష్ణ, గంట్లప్ప గౌడ , మహమ్మద్ రఫీ, కృష్ణా నాయక్, విశ్వనాథ్, ఆదిల్ బాషా , మంజునాథ్, మరియు ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దార్ బాబు , మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.